

# పనిలేని బార్బర్

''పొద్దుబోక పొద్దు పుచ్చుకోవాలని, సిస్టరిన్లాను వుచ్చిక చేసి నెత్తినెక్కించుకోకండి ముందే చెప్తున్నా. తరవాత నన్ననద్దు. దాని ప్రస్తావన నా వద్ద తేవద్దు. ''అయ్యో యిలా చేసింది. నాకేం తెలుసు!'' అని విస్తుబోతే చూడను. వినిపించుకోను. శలవు మీదున్నట్టున్నారు. యెన్నాళ్లో మరి? శలవు వాడుకోవాలనుకుంటే మరో వ్యాపకం పెట్టుకోండి. గెస్టుగా క్లబ్‌కి వెళ్లచ్చు. కోచింగ్ సెంటర్సున్నాయి. టెంపొరరీ కోచ్‌గా పనిచేయచ్చు. మీకు పామిస్ట్రీ వచ్చు. ఇష్టం గూడాను చేతులు చూసి భవిష్యత్తు చెప్పటం. అది మంచి వినోదం'' అని హితబోధ చేసింది సుశీ.

నవ్వుతూ చూశాడు వినోద్. సలహా వినటంగానీ, తీసుకోటంగానీ వారి వంశంలోగానీ, రక్తంలోగానీ లేదు. పుంఖానుపుంఖంగా సలహాలు దశదిశలా వుచితంగా పారేయటమే యిష్టం. ముందు జాగర్త వల్ల లాభమేమిటీ? యేదెట్లా జరగాలో అదట్లా జరుగుతుంది అని ఆలోచిస్తాడు వినోద్. అతనికి బదిలీ ప్రమోషన్ కలిసి ఒక్కసారే వచ్చాయి. యెగిరి గంతేశాడు వినోద్. చంకలు గుద్దుకుంటూ ఛార్జి తీసుకుందామని పోతే, ఛార్జి పుచ్చుకునే చోట క్రైసిస్ వచ్చింది. రిలీజ్ అయి ఛార్జి యిచ్చి వచ్చేశాడు వినోద్. వినోద్‌కి చార్జి అప్పగించాల్సిన వుద్యోగీ సర్కారూ పంతాలకూ పోయారు. పట్టు విడవరు. ఆఫీసర్ని వలంటరీ రిటైర్‌మెంటు తీసుకోమంటారు సర్కారు. ఐచ్ఛికంగా, అనారోగ్య కారణం వల్ల గద్దీ దిగుతున్నాను అని చెప్తూ దిగి పొమ్మంటారు. ఆఫీసరు పీకలవరకూ అవినీతి, అధికార దుర్వినియోగం, చిన్న సైజు హత్యానేరంలోనూ వున్నా తన కుందేలును చూపుతూ దానికి మూడే కాళ్లు అంటున్నాడు. చెప్పినమాట వినకపోతే పింఛనీ హుష్ కాకి అవుతుందన్నారు సర్కారు. యెడాప్టెడ్ డాటరు క్రైసిస్‌లోకి పోయి, దారీ తెన్నూ గానక సూయిసైడ్ ద్వారా పైకి పారిపోయింది. ఇన్సూరెన్సు వారది హత్య అని గాడ్‌ఫాదరే నేర్పుగా పని పూర్తి చేశాడు. భీమా రాదు. అది యాక్సిడెంట్‌గాదు అంటున్నారు.

''ఇటువంటి చోటికి వేశారేం నన్ను? ఇదిప్పుడప్పుడే పరిష్కారమయేట్టు లేదే. శలవు గుంజుతా. గెజెటెడ్ అయినానని వుబ్బిపోతే మాళ్లా అసిస్టెంటూ, డెప్యూటీ అనిపించుకోవాలా?'' అని తీర్మానించుకుని శలవుకోరాడు. ''శలవు లేదు. వాడేసుకున్నావు. తండ్రికి సీరియస్సనీ, అవసానదశలో దగ్గరుండి, తులసి తీర్థం ఆయన గొంతులో పోసి, చెవులల్లో నారాయణ నారాయణ అనాలనీ, అది డ్యూటీ అనీ యెందువల్లనంటే తండ్రి నీ మీద ఇన్‌వెస్టు చేశాడనీ గడుసుగా శలవు వాడుకున్నావు. నీ తండ్రి డెత్‌బెడ్‌మీద లేడు'' అంటే రాజీనామా దాఖల్‌చేసి బెదిరించావు. దాన్ని విత్‌డ్రా చేయించేప్పటికి తాతలు దిగొచ్చారు. అసెంబ్లీలో దుమారం లేస్తుంది. నీకేం తెలుసు? గడిచిన కాలంలో ఒక జనరల్ రాజీనామా యిచ్చేప్పటికి పెద్ద రాద్ధాంతమైంది'' అని సాధించి జీతనష్టం మీదిస్తాము తీసుకో అని యిచ్చారు సర్కారు. వినోద్ తీసుకున్నాడు.

డ్యూటీ డ్యూటీ అంటూ మునిగితేలే వినోద్‌కి కాలక్షేపం జరగలేదు. లక్కీగా సిస్టరిన్లా వచ్చింది. పిల్లలు నాకే అలవాటు చూసి పోదామని వచ్చాను అంటే నిజమేననుకున్నాడు. స్టడీ చేస్తే షిజోఫ్రీనియా అటాక్ అయిందేమో అనుకోవాల్సి వచ్చింది వినోద్‌కి. పని ముట్టుకోదు. ఫ్రెండ్లీగా వుంటుంది. శరీరారోగ్యం బాగున్నది. మంచి తిండి పుష్టి వున్నట్టు చిరుతిండి మేస్తుంది. అందుబాటులో చిరుతిండి లేకపోతే వెండిపళ్లెంలో పొడన్నం పెట్టుకుని, ఒగ్రగా పళ్లగోంగూర పచ్చడేసుకుని, ఆవకాయ ముక్క పిండీ వూటా నూనె వేసుకుని నూకల నెయ్యిపోసుకుని, నీరుల్లి ముక్కలు, పెద్ద ముద్దలతో కలిపి తినేస్తుంది. టైమెంత అనే ధ్యాసే లేదు. త్రేన్చి పొట్ట నిమురుకుని చేయి కడుక్కుని లేస్తుంది. మజ్జిగ అక్కర్లేదు. నోటికీ, నాలుక్కి మంచి రుచి వచ్చిందిట. ఆవకాయ ముక్క పీచు చీకి బుగ్గన పెట్టుకుంటుంది. పనిపిల్లను పిలిచి ''అవన్నీ తీసేయ్. పొట్ట భర్తీగా తిన్నా నా కాళ్లు వంగవు'' అన్నది. పనిపిల్ల నవ్వి పారిపోతే, పళ్లెం యెత్తి నీళ్లు పారబోసి, కృష్ణుడు చక్రం బంపినట్టు, పళ్లెం విసురుతుంది దొడ్లోకి సిస్టరిన్లా. చూచి ఆనందించేంత చక్కగా డ్రెస్ చేసుకుంటుంది. మంచి రంగు. మంచి

వయసు. బ్యూటీ పార్లర్‌కి వెళ్లక్కర్లేదు. కాసేపు నవ్వి నవ్వించి, పిల్లలతో ఆడి బెడ్ మీద వెల్లికిలా పడుకుని పెద్దగా అరుస్తుంది సిస్టరిన్లా.

''ఛస్తున్నా. అరికాళ్లు మంట. మజ్జిగ తాగలేదు. కనబడలేదు. యెవరన్నా యిచ్చారా తాగమని? పొడన్నం మేకులల్లే వున్నది. అరగలేదు. పొట్ట బిర్ర బిగిసి వుబ్బింది. యెనిమా తీసుకోవాలి''.

పిల్లి గుడ్డిదైతే యెలుక యెకసక్కాలాడిందని సామెతలాగా వినోదించాడు వినోద్. యెందుకు సిస్టరిన్లాని వప్పన్నిస్తారో తెలియదు. వంచికి పోతే చెడెదురైందన్నట్లు, హేట్రెడ్ విత్ లవ్ అనే సామెత అప్లై చేశాడు వినోద్. సిస్టరిన్లా బాగానే ఆడిస్తుందని అర్థమైగూడా ఆమె పాటకనుగుణంగా ఆడాడు వినోద్. కొత్తగా రిలీజైన పిక్చరు ''ప్రేమ పక్షులు'' అనేదానికి తోడ్కొని వెళ్లి వదిలించింది. పురుషుడు అందునా గెజెటెడ్ ఆఫీసర్. ఇంటర్వల్‌లో వరండాలో కొచ్చి బొండాబజ్జీ, పాప్‌కారన్ ఆరగించి, మెషీన్ కాఫీ తాగి త్రేన్చి పొట్ట మీద రాచుకున్నది. మళ్లా వచ్చి కూచున్నారు నవ్వుతూ హాలులోనే వ్యాఖ్యానిస్తుంటే రెండువేపులవారూ, ముందు వెనుకలవారూ, విడ్డూరపడి, నోరు మూయించటం చాతకాక హాలు వదిలి వెళ్లారు. పెద్దగా నవ్వింది సిస్టరిన్లా.

చివరకి నడుస్తున్న ఫైటింగ్ సీన్లు తన్మయత్వంతో చూస్తున్నాడు వినోద్. శుభం చూసి అందరూ లేస్తే తానూ లేచి పక్కన చూస్తే సిస్టరిన్లా లేదు. గాభరాపడి జనాన్ని నెట్టుకుంటూ తోసుకుంటూ అందరి మొహాలు పరిశీలిస్తూ వెళ్తే వరండాలోనూ లేదు. మెట్లమీద లేదు సిస్టరిన్లా. వినోద్‌ని వినోదంగా చూశారు జనం. ''లేడీ లా కోసమేమో వెతుకుతున్నాడు'' అని నవ్వుకున్నారు.

2

గుడ్లు పెట్టుకు చూస్తూ చేతులు వెనక కలిపిపెట్టుకుని, పనిలేని బార్బర్‌లాగా తిరుగుతున్న వినోద్‌ను గమనించింది సుశీ. ''నసాళానికంటిందేమో అవమానం'' అనుకున్నది. పలకరించలేదు. పనీ. పనీ. చుట్టాలు, స్నేహితులు, పరిచితులు అపరిచితులతో యిల్లు సందడిగా వున్నది. ''చేతులలో సమయానికి పాదివుంటే

పిల్లితలన్నా షేవ్ చేసేవారు'' అని నవ్వుకున్నది. మిర్రిమిర్రి చూశాడు. పక్కచూపులు బరపాడు. నేలచూపులు చూశాడు. నవ్వటానికి ప్రయత్నిస్తున్నాడు. అనుమానంగా నాలుగువైపులా చూస్తున్నాడు. సుశీ వినోదించింది. ఓ రిలెటివ్ మేనగోడలౌతుంది. బియస్సీ అయిందనిపించింది. పేరు మనోరమ. వాళ్లవాళ్లు సంబంధం చూసి స్థిరపరచారు. ఆచారప్రకారం పెళ్లి చూపులు జరుగుతాయి అనాడు.

పెద్దహాలులో కుర్చీలూ సోఫాలూ అర్ధచంద్రాకారంలో అమర్చారు. వెలగల తివాసీ కింద పరిచారు. పూలూ, లతలూ రంగు దారాలతో క్విక్ ఎంబ్రాయిడరీ చేసి, చిలకలూ, హంసలూ వుడతలూ, చిన్న నీటి పడియ, పూలచెట్లు వున్నాయి దానిమీద. పెళ్లివారు వచ్చి ఆసీనులయారు. ఒక ప్రౌఢ తాను అలంకరించుకుని, బాగా అలంకారం చేసిన పెళ్లి కూతుర్నితోడ్కొని వచ్చి కుర్చీలో కూచోబెట్టింది. మరో యిద్దరు స్త్రీలు, స్టీలు ట్రేలు తీపి సరుకులు ప్లేట్లల్లో వుంచినవి, పకోడీలున్న ప్లేట్లున్నవి యెదురుగా బల్లమీదుంచి వెళ్లి కూచున్నారు. మరొకామె ఐస్‌వాటరున్న వెండిగ్లాసుల ట్రే వుంచింది. ఇంకొకామె నెస్‌కేఫ్ నింపిన చిన్న కప్పుసాసర్లున్న పళ్లెం బల్లమీదుంచింది. బాగా నగలు, మేకప్ వున్నామె, జార్జెట్ చీరా బ్లౌజూ దిద్దుకుంటూ పెళ్లికొడుకుతో అన్నది.

''మా అమ్మాయి వివరాలు తెలిసి వుండాలీపాటికి అల్లుడుగారూ. మ్యూజికల్ యినుస్ట్రుమెంట్సు వాయిస్తుంది మా అమ్మాయి మనోరమ. లలిత సంగీతం, ఫిల్మ్ సంగీతం, భావగీతాలు పాడుతుంది. వాళ్ల కళాశాల ఆనివర్సరీకి వేసిన నాటికలో పాత్రలు తెచ్చుకున్నది. అంతర్ కళాశాల బాడ్మింటన్ పోటీలో పాల్గొన్నది. మా మనోరమకి అరేంజ్‌డ్ మారేజ్ మీదే గట్టి నమ్మకం'' అంటూ లేచి, ''రామ్మా ఫలహారం అందించాలి. కాఫీ చల్లారిపోతుంది'' అని లేవదీసింది.

పెళ్లికూతురు తలెత్తి చూడటం మాట అటుంచి, కళ్లెత్తన్నా చూడలేదు. అమ్మాయివేపు వారు వచ్చి సాయపడ్డారు. తెచ్చి తమ మధ్య కూచోబెట్టుకున్నారు. సంతోషంతో అంగీకార సూచకంగా తలలూపి పెళ్లివారు వెళ్లిపోయారు. హాలులో

వున్నవారు తాపీగా తింటున్నారు. కాఫీ సేవిస్తున్నారు. ఒక కుషన్ కుర్చీలో సుఖాసీనుడై, ఒక కాలాడిస్తూ, వినోదిస్తున్న వినోద్ పెళ్లివారు వెళ్లిపోయాక అన్నాడు.

''అదేం సబంధం? ఆ పెళ్లివారు నాకు తెలిసినవాళ్లే. యెవరో కొత్తవాళ్లనుకున్నా. వాళ్లకి అయిదు లక్షల అప్పులున్నాయి. వాళ్లు నడుపుతున్న సూపర్‌బజార్ నష్టం మీద నడుస్తున్నది. కలిసొస్తుంది లెమ్మని, అప్పు చేస్తూ, ఫ్లాట్లు కొని అమ్ముతున్నాడు తండ్రి. గ్రూమ్‌కి మానియా వున్నది. నాతో మాట మాత్రం చెప్పి వుంటే నేను ముందే చెప్పేవాడిని మరోటి చూసుకోండని''.

వరసకు బావమరిది అయిన శేషు డెప్యూటీ కలెక్టరు, కాఫీ సేవిస్తూ అన్నాడు. ''నీ యెరికలో దివ్యమైన సంబంధమున్నదా వినోద్ బావా? కట్నం కానుకలూ లేవని చెప్తూ సెటిల్ చేస్తావా వినోద్‌బావా? గుళ్లో పెళ్లిలాటిదిగానీ దండలు మార్పించే పెళ్లిగానీ ఒక్కపూటలో ముగించేస్తాం. సదస్యం, బాకాలూ, తాషామర్పాలూ, ధక్కడోలూ అప్పగింతలూ సత్యనారాయణ వ్రతాలూ వుండవు. పెళ్లి చూపులు ముగించి నవ్వుతూ వెళ్లిన పెళ్లికొడుకు మానియాయే కావచ్చుగానీ బావా, లేత వయసు. ద్వితీయంగాదు. రిజర్వుబాంకులో వుద్యోగం ఖాయమైంది. లేడీ లౌలూ లేరు. గళ్‌ఫ్రెండ్సూ లేరు వాడికి'' అంటున్నాడు.

వినోద్ మొహం చింకిచాటంత అయి వికసించింది. నవ్వులు ఒలకబోశాడు. ఒళ్లు కదిలించుకుంటూ అన్నాడు.

''లేకేం శేషాచలం! నా పింతండ్రి చివరి కొడుకు నాకు తమ్ముడౌతాడు. వాడికింకా నచ్చిన సంబంధం కుదరక పెళ్లికాలేదు. చేతులు కాల్చుకుంటున్నాడు. అన్నాయ్! మంచి మాచ్ చూసి సెటిల్ చేయి. ఈ వుడకేసే పని దాని నెత్తిన రుద్దుతా. నాకు వంటరాదు. మా అమ్మకి ఎపిలెప్సీ. ఆవిడొచ్చి సాయంగా వుంటానంటుంది. నాకు భయం. వద్దన్నా. న్యూనత ఫీలౌతుంది. న్యూసెన్సు కిందికి వస్తుంది అమ్మతో వ్యవహారం'' అన్నాడు తమ్ముడు. సాక్సు లేకుండా నేలమీద నిటారుగా నిలబడితే ఆరడుగులుంటాడు నా తమ్ముడు. నే చెప్పినట్టు

వింటాడు. సుముహూర్తం కేర్ చేయడు. రెడీమేడ్ దుస్తులు కొని తెచ్చుకుని ధరించినట్లు వైఫ్‌ని తెచ్చుకోవాలని సరదాపడుతున్నాడు'' అంటున్నాడు వినోద్.

''పిల్లి తల షేవ్ చేస్తాడా? అన్నిటిలో తలదూరుస్తాడా? అలాటివాడిని చూడమని మనోరమ నాతో చెప్పింది'' అని సరసోక్తులాడుతున్నాడు శేషు.

గాలిదుమారంలా, యిసుకతుపానులా సిస్టరిన్లా వచ్చింది హాలంతా కలియచూసి, వినోద్ మీద దృష్టి నిలిపింది.

''చెప్పకుండా వుడాయించావేం థియేటర్నించీ? వినోద్! ఆడకూతుర్ని యేమైపోతాననుకున్నావ్? పోలీస్ స్టేషన్ తెలుసు నాకు. యస్సై మా బావగారే. రిపోర్టిచ్చి వచ్చా. వినోద్ అనే జెంటిల్‌మాన్ నన్ను వంచించాడు. అత్యాచారం జరిగింది నా మీద సద్యోగర్భం ధరించాను. వేవిళ్ల జ్వరంతో లేవలేక యింత వుడకేసన్నా పెడతాడేమోనని యెదురుతెన్నులు చూస్తే వినోద్ అనే వంచకుడు నల్లపూసైనాడు. సెలవుమీదే వున్నాడు. నేనే కత్తికి భాషికం కట్టి తీసికెళ్లి సివిల్ మారేజ్ చేసుకున్నాను. వచ్చి యేలుకోవాల్సిందే. బహుభార్యాత్వం నేరం గనక ఎక్స్ వైఫ్‌కి డైవోర్సివ్వాలి. వీడు హరాస్ చేస్తున్నాడని ఎక్స్ వైఫ్ అనాలి. దానికి బోయ్‌ఫ్రెండున్నారని వీడనాలి'' అని వ్రాసి యిచ్చి వచ్చాను'' అని వూగుతూ వచ్చేస్తుంటే, వినోద్ మొహాన కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. వెలవెలపోతున్నాడు.

''సెలవు ముగియలేదురా బావా! చార్జ్ తీసుకోవూ'' అంటూ లేచాడు శేషు.

సిస్టరిన్లా గభిక్కున వచ్చి వినోద్ ఛాతీ మీద షర్టు పట్టుకున్నది. నలుగురు ప్రౌఢలు జాలిజెంది లేచివచ్చి వినోద్‌ని ఆదుకున్నారు. సిస్టరిన్లా గుప్పిటనించి వదిలించారు.

''ఫలహారం కాఫీ కానియ్యాలి'' అంటూ లాక్కెళ్లారు కిచెన్‌లోకి. సుశీ ప్లేట్లు యెదురుగా వుంచి కుర్చీ చూపింది. వీరు బైటికొచ్చి, కిచెన్ తలుపుమూసి గొళ్లెం పెట్టారు.

వినోద్ తెప్పరిల్లి లేచి వీధి వాకిలి వేపు వెళ్తున్నాడు. ''సైకో ఎనలిస్టు నా ఫ్రెండే వినోద్ బావా. గెట్టుగెదర్‌కి తెమ్మన్నాడు నిన్ను'' అని హాస్యమాడుతూ వినోద్ పక్కనే నడిచివెళ్లాడు వీది వాకిలివేపు శేషు.